క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు.భక్తులు స్వామివారి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామికి క్షీరాభిషేకం నిర్వహించి భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పట్టుదలతోనే ఉన్నతస్థాయికి



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

పెందుర్తి: ఉన్నత స్థానంలో నిలవాలంటే పట్టుదలతో ప్రయత్నించడంతో పాటు సమయపాలన అవసరమని ఇండియన్ రైల్వేస్ రిసోర్స్ పర్సన్ వాసుపల్లి ధరణి సంతోష్‌కుమార్ అన్నారు. పినగాడిలోని విస్డం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు 'కాంపిటేటివ్ ఎగ్జామ్ ఓరియేంటేషన్ గైడెన్స్' వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ పలు అంశాలపై విద్యార్థులకు సూచనలు అందించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జాషువా, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదిత్య కళాశాల విద్యార్థులు

పెందుర్తి: జాతీయ సేవా పథకంలో భాగంగా గోపాలపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు వేపగుంట, చీమలాపల్లి ప్రాంతాల్లో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో చెత్తను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేపట్టారు. జోన్–8 జేసీఎస్ కన్వీనర్ మనాలత జోబ్‌దాస్, ప్రిన్సిపాల్ మురళీమోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారి సి.హెచ్. ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చైతన్య యాత్రను జయప్రదం చేయండి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ వద్దకు బుధవారం ఉదయం ప్రవేశించనున్న కార్మిక చైతన్య యాత్యను జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రమాద బీమా, ప్రత్యేక అలవెన్స్, జీతం, ఈఎస్ఐ వంటి సమస్యలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు. కార్మికులంతా సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వెంకటాద్రిపై విశేష పూజలు




అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకుడు, స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామికి విశేష పూజలు జరిపారు. తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. హారతి పాశురం సందర్భంగా భక్తులతోనే స్వామికి హారతి ఇప్పించారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు.

బంగారు పతక విజేతకు సత్కారం



లలిత కుమారిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్

సబ్బవరం: ఇటీవల జైపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి స్క్వే మార్షల్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ మొదటి సంవత్సర విద్యార్థిని ఎస్. లలిత కుమారిని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ అభినందించారు.అండర్–19 మహిళా విభాగంలో ఈ ఘనత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యతో పాటు కళలు, క్రీడా రంగాల్లో పాల్గొని ఉన్నతికి చేరుకోవాలని ఆకాంక్షించారు. లలిత కుమారి మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులు,తల్లిదండ్రులతో పాటు కోచ్ త్రినాథరావు ఎంతో ప్రోత్సాహం అందించారన్నారు.

సమసమాజ స్థాపనే లక్ష్యం

పరవాడ: ఆర్థికంగా వెనుకబడిన వారికి స్వావలంబన చేకూర్చడమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గొర్లి రామునాయుడు అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఆర్థిక వ్యత్యాసాలను తగ్గించి సమ సమాజం స్థాపించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ప్రణాళికలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్, రామకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న రాంకీ ప్రతినిధులు గిరిధర్ భక్షి, డాక్టర్ శ్రీకాంత్



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

పరవాడ: క్రీడల్లో రాణిస్తే మానసిక ఉల్లాసంతో పాటు మంచి గుర్తింపు వస్తుందని రాంకీ ప్రతినిధులు గిరిధర్ భక్షి, శ్రీకాంత్ అన్నారు. జేఎన్ ఫార్మాసిటీలో రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో రియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఖోఖో, కబడ్డీ, ముగ్గులు, వాలీబాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం బహుమతులు అందజేస్తామని నిర్వాహకుడు ఎం.డి.రాజు చెప్పారు.

విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం అవసరం



డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ, సంఘం నాయకులు

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాలు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరపు క్యాలెండర్లు, డైరీలను మంగళవారం తన చాంబర్‌లో ఫెడరేషన్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాదిరెడ్డి గంగాధర్, జిల్లా ముఖ్యగౌరవ సలహాదారు జగన్నాథరావు, కోశాధికారి సంధ్యారాణి, గోవింద, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో మైయాక్సెస్ ఒప్పందం



ఎంవోయూ చేసుకుంటున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, మైయాక్సెస్ ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు శిక్షణ, ఉపాధి కల్పన నిమిత్తం మై యాక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. నగరంలోని ఓ ప్రవేటు హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, ట్రెనింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీవోవో వి.వినోద్‌కుమార్ సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్, మై యాక్సెస్ ప్రతినిధి టి.సూర్యస్వరూప్‌లు ఎంవోయూ కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో జీపీటీ ఎలక్ట్రానిక్స్ విభాగం హెడ్ ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

యువ ఉద్యోగులపైనే స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు యువ ఉద్యోగులపై ఆధారపడి ఉందని స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. విభాగంలో మంగళవారం జరిగిన యువ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఇందులో యువ ఉద్యోగులు ముందుండాలన్నారు. ఈ సందర్భంగా వారికి ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. అదే విధంగా ఉక్కు ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ రీడ్రెసల్ కమిటీ సభ్యులు బి.టి.నాయక్, విభాగం హెచ్‌ఆర్ ఇన్‌చార్జ్ డాక్టర్ రాధికలను కలిసి తమ సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విభాగం ఉద్యోగులు అరవింద్ కుమార్, కొమ్ము ప్రసాద్, సురేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వై.మస్తానప్ప, ఎం.వి.వి.సత్యనారాయణ, జి.సురేష్, ఎం.సీతారామ్, ఎ.జగన్, కె.వినయ్ రాంజి, పి.సత్యనారాయణ, వెంకట రమణ, మురళీ కాశీబాబు, రవికుమార్, సుమన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్

- జోనల్ కమిషనర్ సింహాచలం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్సీ సింహాచలం తదితరులు

గాజువాక: జీవీఎంసీ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వందడుగుల రోడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి, జోనల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జోనల్ కమిషనర్ పి.సింహాచలం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ అత్యంత సామాన్య కుటుంబం నుంచి వచ్చి ప్రపంచం మెచ్చుకునే మేధావిగా గుర్తింపు పొందారన్నారు. తన మేధస్సుతో దేశానికి దిక్సూచిగా నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరం కంకణబద్ధులు కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ నెల 18 వరకు నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును ఆహ్వానిస్తున్నాం

అల్లిపురం : బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పును ఆహ్వానిస్తున్నామని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ అన్నారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిల్కిస్ బానో నిందితుల విడుదలను ఛాలెంజ్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు కాగా విచారణ చేపట్టిన కోర్టు ముద్దాయిలందరినీ లొంగిపోవాలని ఆదేశించిందన్నారు. ఈ తీర్పు గుజరాత్ ప్రభుత్వానికి గుణపాఠంగా భావిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో హెచ్‌ఆర్ అనూరాధ, ముస్లిం థింకర్స్ ఫోరం ప్రతినిధి జహీరా, నాస్తిక సమాజం ప్రతినిధి రాంప్రభు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 27వ రోజు మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు.

అష్టదళ పద్మారాధన..

108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో, త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల 500 మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాయం చేస్తానంటూ మోసం

ఏటీఎం నుంచి రూ.1.02 లక్షల నగదు విత్‌డ్రా

కూర్మన్నపాలెం: సాయం చేస్తానని చెప్పి ఓ వృద్ధుడి వద్ద నుంచి ఏటీఎం కార్డు తస్కరించి, నగదు విత్‌డ్రా చేసిన గుర్తు తెలియని వ్యక్తిపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన గుడూరు స్వామిబాబు (71) ఈ నెల 5వ తేదీన స్థానిక ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు నగదు కోసం వెళ్లారు. ఏటీఎంలో కార్డు పెట్టి నగదు విత్‌డ్రా చేస్తున్నా రాకపోవడంతో వెనుక ఉన్న గుర్తు తెలియని వ్యక్తి నగదు డ్రా చేసి ఇస్తానని చెప్పి, కార్డు తీసుకుని రెండు వేల రూపాయలు నగదు విత్‌డ్రా చేసి స్వామిబాబుకు ఇచ్చి, ఒరిజినల్ ఏటీఎం కార్డు స్థానంలో డూప్లికేట్ కార్డు ఇచ్చి వృద్ధుడిని పంపించి వేశాడు. అనంతరం ఒరిజినల్ ఏటీఎం కార్డును 11 సార్లు ఉపయోగించి ఒక లక్షా రెండు వేల రూపాయల నగదు విత్‌డ్రా చేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు స్వామిబాబు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహోద్యమ దిశగా 'ఉక్కు' దీక్షలు



దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్ష మహోద్యమ దిశగా మారనుందని పోరాట కమిటీ నాయకులు అన్నారు. మహనీయుల ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1062వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా నిలదొక్కుకుని విజయ పరంపరలో కొనసాగుతోందన్నారు. నిర్వాసితులకు, కార్మికులకు అన్యాయం చేస్తూ సంస్థను అమ్మడం దుర్మార్గమని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

14న సింహగిరిపై గోదా కల్యాణం

- 16న గజేంద్రమోక్షం
- ఈ నెల 11 నుంచి 17 వరకు ఆర్జిత సేవల రద్దు
- దర్శనాల వేళల్లో మార్పులు



సింహాచలం: భోగి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 14న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గోదా కల్యాణాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం జరిగే నిత్యకల్యాణం కూడా గోదా కల్యాణంతో కలిపి నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న మకర సంక్రాంతి పురస్కరించుకుని ఉత్తరాయణం పుణ్యకాలం పూజల సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనాలు ఉండవన్నారు. 16న కనుమ పురస్కరించుకుని కొండదిగువ పూలతోటలో గజేంద్రమోక్షం ఉత్సవం ఉంటుందన్నారు. ఆ రోజు సింహగిరిపై సాయంత్రం 4 గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కొండ దిగువకి తీసుకెళ్తామన్నారు. గజేంద్రమోక్షం ఉత్సవం అనంతరం రాత్రి అడవివరం పుర వీధుల్లో స్వామికి గజవాహనంపై తిరువీధి నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవం సందర్భంగా 16న సాయంత్రం 6 గంటల తర్వాత సింహగిరిపై స్వామి దర్శనాలు లభించవన్నారు. తిరిగి 17న ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు ఉంటాయన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే సాయంత్రం 7 గంటల తర్వాత దర్శనాలు లభించవన్నారు. ఈ నెల 12న కూడారై ఉత్సవం సందర్భంగా ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు దర్శనాలు లభించవని వివరించారు. భక్తులంతా గమనించాలని ఈవో కోరారు.

అప్పన్న సన్నిధిలో 'పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ'



అప్పన్న ఆలయంలో కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఎనర్జీ బృందం దర్శించుకుంది. కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు కిసాన్ కపూర్, సునీల్ కుమార్ మోండల్, కేఆర్ఎస్.రాజేష్ కుమార్ స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వీరికి పూర్ణ కుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు. సూపరింటెండెంట్ పిళ్లా శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న పింఛన్ల పండగ



95వ వార్డులో నూతన పింఛన్లు అందిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: వైఎస్సార్ పింఛన్ కానుక పెంపుదలపై సర్వాత్రా హర్షం వ్యక్తమవుతోంది. పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3 వేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. జీవీఎంసీ 95వ వార్డు 499, 500, 502, 503, 504 సచివాలయాల పరిధిలో నూతనంగా పింఛన్లు మంజూరు అయిన 28 మందికి కార్పొరేటర్ ముమ్మన దేముడు మంగళవారం వైఎస్సార్ పెన్షన్ కానుక అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలపై నిజమైన ప్రేమ కలిగిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు ఏం కావాలో..వారికి ఎం చేయాలో నిరంతరం ఆలోచించే మనసున్న నేత సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన్ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అయిత ఎర్రయ్య, కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, బొట్ట రాము, యల్లపు పరదేశినాయుడు, కంచిబోయిన వెంకటరావు, బొడ్డు దేముడు బాబు, పులమరశెట్టి లక్ష్మణ్, పెదగాడి చిన్నారావు, గంట్ల నరసింహమూర్తి, కుంచా భార్గవ్, మిందిరామునాయుడు, రాపర్తి కాశి, గోపాల్, భాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



బాధ్యతలు స్వీకరించిన సీఐ రమణ

సబ్బవరం: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సీఐ పిన్నింటి రమణ కోరారు. నూతన సీఐగా ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఏపీ ట్రాన్స్‌కోలో విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005–06లో సబ్బవరం ఎస్ఐగా పనిచేసినట్లు తెలిపారు. సంక్రాంతి పండగను ప్రజలంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా సహించేదిలేదన్నారు. కోడి పందాలు,గుండాట వంటి చట్ట వ్యతిరేక చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.ఇటువంటివి ఎక్కడైనే నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

హిందూ కమిషన్ ఏర్పాటుకు డిమాండ్



సమావేశానికి హాజరైన అతిథులు

అల్లిపురం : స్వయం ప్రతిపత్తి కలిగి జ్యుడీషియల్ స్థాయి గల హిందూ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో దీనిని చేర్చాలని హిందూ ధార్మిక పరిషత్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హిందూ డిక్లరేషన్ సాధనకు ధార్మిక, సామాజిక ప్రముఖులు, ధార్మిక పరిషత్ ప్రతినిధులు, బ్రాహ్మణ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ముందుగా కార్యక్రమాన్ని హిందూ ధార్మిక పరిషత్ సభ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నెల్లిమర్ల దుర్గాపీఠం పీఠాధిపతి చిన్నస్వామి మాట్లాడుతూ హిందువుల సంప్రదాయాలను, ఆలయాలను పరిరక్షించే దిశగా హిందూ కమిషన్ ముందుకెళ్తుందన్నారు. 26వ తేదీన అన్ని రాజకీయ పార్టీలకు మెమొరాండం ఇస్తామన్నారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ట చేసే సమయంలో రాష్ట్రంలో అన్ని దేవాలయాల ముందు హిందూ కమిషన్ ఏర్పాటు చేయాలని చట్టబద్ధంగా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె. లలిత్, రాగం కిషోర్, బాలాజీ, పీవీ నారాయణ, రాధాకృష్ణ, మాజీ శాసన సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎంఎల్‌సీ పీవీఎన్ మాధవ్, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పీవీ రామారావు, డాక్టర్ రమణమూర్తి, శ్రీనివాస్, సీహెచ్ వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.